# ప్యారసైట్లు

"ఆంటీ! మీ మ్యారేజ్ డే సందర్భంగా మమ్మీ ఈ రోజు రాత్రి మీ అందరికీ డిన్నర్ ఏర్పాటు చేస్తున్నది. ఒకరిద్దరు ఫ్రెండ్స్‌ను కూడా మిమ్మల్ని పిలుచుకోమంది".

సౌందర్య ఆ యింట్లోకి అద్దెకు దిగి ఇరవై రోజులే అయింది. ఈ యిరవై రోజుల్లో పక్క పోర్షన్‌లోని సుమిత్ర రెండోసారి భోజనాలు ఏర్పాటు చేస్తోంది. వారం క్రితం మాటల సందర్భంగా తమ మ్యారేజీ డే అని చెప్తే గుర్తుంచుకొని పొద్దున్నే కొడుకుతో డిన్నర్ గురించి చెప్పడం సౌందర్యకు కితకితలు పెట్టింది. మ్యారేజీ డేకు తాము యితర్లను పిలిచి భోజనం పెట్టడమే యింత దాకా చూసిన సౌందర్యకు సుమిత్ర ఆహ్వానం తబ్బిబ్బు చేసింది.

సుమిత్ర చాలా కాలంగా ఆ ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఇంటి వోనర్సు రెండో పోర్షను కిరాయి బాధ్యత కూడా ఆమెకే అప్పగించారు. ఇంటివాళ్లు వేరే ఊళ్లో వుంటారు. మూడు నెలలకొకసారి వచ్చి కిరాయి తీసికెళ్తారు. ఆలస్యం అయితే సుమిత్రే డ్రాఫ్టు తీయించి వారికి పంపుతుంది.

సుమిత్రకు ఇద్దరు పిల్లలు. పెద్దవాడు రాకేశ్ ఇంటరు చదువుతున్నాడు. రెండోవాడు వినీత్ పదవ తరగతి చదువుతున్నాడు. సౌందర్య కొడుకు అతుల్, వినీత్ క్లాసుమేట్సు కూడా. సౌందర్య చిన్నకొడుకు హిరణ్ ఎనిమిదో తరగతి.

"ఏమండి! సుమిత్ర వదిన ఎంత మంచిదండి! మన మ్యారేజీ డేకి ఇవాళ వాళ్లింట్లో మనని భోజనానికి రమ్మంది. ఒకరిద్దరు మన ఫ్రెండ్సును కూడా తీసుకు రమ్మంది" ఉత్సాహంగా భర్త శ్రీకాంత్‌కేసి చూస్తూ అంది.

సౌందర్య శ్రీకాంత్ నవ్వుతూ అన్నాడు– "తినడం ఒక్కటే కాదోయ్! ఇతర్లకు పెట్టడం కూడా రావాలి. సుమిత్రకు ఆ కళ బాగా తెల్సు"

"అంటే నాకు తెలియదంటారు" బుంగమూతి పెట్టింది సౌందర్య.

"అలా కాదోయ్! మ్యారేజీ డేకి భోజనానికి రమ్మని నువ్వే ఒకరోజు ముందుగా వాళ్లకు చెప్పి ఉంటే బాగుండేది" అన్నాడు శ్రీకాంత్.

అంతలో సుమిత్ర వాళ్లాయన భూకేశ్వర్ వచ్చాడు.

"ఇవాళ రాత్రికి మీరంతా మా యింట్లోనే భోంచేయాలి. మీ మ్యారేజీ డేకి ముఖ్యులైన యిదుగురు ఫ్రెండ్స్‌ని కూడా పిలుచుకు రండి. మా యింట్లో కెమెరా ఉంది కనుక ఇబ్బంది లేదు. ఆఫీసు నుండి మీరు తొందరగా రండి" అంటూ చెప్పి వెళ్లాడు.

సుమిత్ర పిల్లలు తమ మమ్మీ, డాడీల మ్యారేజీ డేలాగానే ఎంతో ఉత్సాహంగా చకచక పనులు చేస్తున్నారు. రాత్రి భోజనాలయ్యేసరికి సౌందర్యకు హృదయం నిండిపోయింది. ఇంత ఆప్యాయత తాను ఎప్పుడూ చూసి ఎరుగదు. సుమిత్రకు సౌందర్య మరీ మరీ కృతజ్ఞతలు చెప్పింది.

రెండు నెలలు గడిచాయి.

"పిల్లలు వాళ్ల డాడీయే అన్ని పనులు చేశారు. ఈ రోజు వంట కూడా మా ఆయనే చేశాడు. పెద్దాడు చేసిన కొబ్బరిపచ్చడి ఎలా ఉంది" అంది సుమిత్ర.

"ఎంటీ! రాకేశ్‌తో పచ్చడి యింతబాగా చేస్తాడా! ఓసారి మా యింట్లో కూడా రాకేశ్‌తో పచ్చడి చేయించాలి. మా పిల్లలున్నారు. ఒక్క పనీ చేయరు వదినా" అంది సౌందర్య అలా అనడంలో బాధ కన్నా గర్వం ఎక్కువ కనపడి ఆశ్చర్యపోయింది సుమిత్ర.

"మా పిల్లలు అన్ని పనులు చేస్తారు. వాళ్ల డాడీ డ్రెస్సుల్ని కూడా వాళ్లే ఉతుకుతారు. యిస్త్రీ చేస్తారు. నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు వాళ్లే వంట చేస్తారు. పక్కింటి పిన్నియో, ఆంటీయో వచ్చి వంటచేయాలని ఆశించరు" అంది సుమిత్ర.

"మీరు అదృష్టవంతులండి. మీ పిల్లలు మీరు చెప్పినట్లు వింటారు. మా పిల్లలు అస్సలు వినరండి" అంటూ వాపోయింది సౌందర్య గర్వంగా.

పిల్లలకు పనెలా నేర్పాలో, పనిని ఎట్లా ప్రేమించాలో చెప్పాలంటూ అరగంట చెప్పింది సుమిత్ర. ప్రతి మాటకు సౌందర్య అలా కాదు వదినా అంటూ అడ్డు చెప్తుంటే సుమిత్రకు కోపంగా అసహనంగా ఉంది. అసలు ఏమిటి ఈవిడ ఉద్దేశం తన పిల్లలు పని చేయాలని కోరుకుంటుందా! వద్దని కోరుకుంటుందా! గత రెండు నెలల్నించి తన పిల్లలు ఈవిడ చెప్పిన పనల్లా చేస్తూ పనిమనుషుల్లా అయిపోయారు. ఈమె ప్రేమగా నవ్వుతూనే సాధికారంగా పిల్లలకి పని చెప్తుంది. పిల్లలు చదువు కోవడానికి కష్టమవుతుంది.

"మమ్మీ! ఈ అంటీ వాళ్ల పిల్లలకు పని చెప్పకుండా నాకే ఎందుకు చెప్తుంది. అతుల్ నా వెంట రమ్మన్నారాడు. పనేమో వాళ్ల మమ్మీదే" అంటూ ఫిర్యాదు చేసిన వినీత్ బాధను ఎలా పరిష్కరించాలో సుమిత్రకు తోచడం లేదు. వాడికి పనిచేయటం నామోషికాదు. తన క్లాసుమేటు పనిచేయకుండా వాడి మమ్మీ కోసం తాను పనిచేయడం నామోషిగా ఉంది. వాళ్లు పక్కపోర్షన్‌లో కొచ్చి రెండు నెలలే అయింది. అప్పుడే పోట్లాట ఎందుకు అని వాళ్లను వారిస్తూ వస్తున్నది. సౌందర్య పిల్లల్ని చూసి తన పిల్లలు చెడిపోవడం సుమిత్రకు కష్టంగా ఉంది. మాట్లాడిన ప్రతిసారీ తన పిల్లలపై తానే ఫిర్యాదు చేస్తూ తానే వారిని సమర్థిస్తుంది సౌందర్య. సుమిత్ర ఈసారి వెనక్కి తగ్గదలుచుకోలేదు.

"అసలు మీ ఉద్దేశం ఏంటి వదినా! పిల్లలు మీ మాట విని యింటి పనులన్ని చేయాలనుకుంటున్నారా! వద్దనుకుంటున్నారా!" నిలదీసింది సుమిత్ర.

ఆ మాట సూటిగా ఉండడంతో ఖంగు తింది సౌందర్య. పిల్లలు వినాలని చెప్తే యిక సలహాలు సూచనలూ యిస్తుందేమో వినాల్సి వస్తుంది. వినొద్దు అని చెప్తే

సమాజానికి ఏం పెడ్తారండి. పందుల్లా తిని రెండు సీట్ల మందం లావెక్కడం తప్ప".

"సౌందర్య! కాస్త మంచినీళ్ల పట్రా!" అంటూ పిలిచాడు శ్రీకాంత్. సౌందర్యకు యిక అవన్నీ వినక తప్పింది కాదు. అవన్నీ వింటుంటే తనను తాను నిలువెత్తు అద్దంలో నగ్నంగా చూసుకున్నట్టు భయపడిపోయింది సౌందర్య. రొటీన్‌గా అన్న మాటలు ఆమె గుండెల్లో బాణాల్లా దిగాయి.

శ్రీకాంత్ వేరు పడేదాకా పోరు పెట్టింది తాను. పి.జి. చేస్తున్న ఆడపడుచు, డిగ్రీ చేస్తున్న మరిది, అస్తమాతో అస్తమానం రోగిష్టి అత్తమ్మ, కోపిష్టి మామయ్య-వాళ్ల బరువు బాధ్యతల్ని మోయడం అంటే జీవితమంతా వెట్టి చాకిరి చేయడమే. అయిదేళ్లు ఉన్న ఊళ్లో ఉద్యోగం చేస్తే కిరాయి మిగులుతుందని అనుకున్నారు ముందు. కాని తన మొగుడి సంపాదనతో బతికే కుటుంబంలో తానే పనిమనిషైపోయింది. ప్రభుత్వాన్ని ఉద్యోగులు డిమాండ్ చేసినట్టు అందరూ ఆయన్ని డిమాండు చేసేవారే. తన కోరికల్ని, ఆయన అవసరాల్ని అడిగినవాళ్లు లేరు.

లక్షల కట్నంతో ఆడపడుచుకు మొగున్ని తేవాలంటే తమ జీతం, జీవితం అంతా బానిసల్లా బతకడమే. ఆడపడుచు అంత పెద్ద యూనివర్శిటీలో వందల మంది విద్యార్థులున్నారు. ఎవరో ఒకర్ని ప్రేమించి లేచిపోతే తమ పీడా పోతుందనుకుంటే ఆడపడుచు నిరాశపరిచింది.

వెధవ యిల్లు, వెధవ కొంప ఓ అచ్చటా లేదు, ముచ్చటా లేదు. ఏ ఆక్సిడెంట్లోనైనా పోతే బాగుండు అని ఎన్నిసార్లు అందో. తిట్టుకుంది తనను తానే కాని ఎవరికి తగలాలో వారికి తగలాలని అట్లా వేరు పడి బదిలీ చేయించుకుని పేగుబంధం తెగి తన కుటుంబంతో స్వేచ్ఛాజీవి అయింది సౌందర్య.

"ఏం లేదండి. నేను కూడా అన్నయ్య లాగే ఆలోచిస్తుంటాను. కాని నాకింత చక్కగా ఎదుటివారికి చెప్పడం రాదండి. ఎంత బాగా చెప్తారు అన్నయ్య" అంటూ ఎండిన పేడపిడకలా ముడుచుకుపోయిన మొహాన్ని నిగనిగలాడే మామిడి పండులా మార్చేసింది సౌందర్య.

ఈ రెండు నెలల్లో నాలుగు సార్లు సుమిత్ర యింట్లో భోంచేసినా తానొక్కసారైనా వారిని ఆహ్వానించలేదు. అదే తన స్వభావాన్ని వాళ్లకు పట్టిచ్చి యిచ్చిందేమో అని సౌందర్య అనుకుని ప్రేమ ఒలకబోసింది.

"అన్నయ్యా! ఈ రోజు మీరంతా మా యింట్లోనే భోంచేయాలి" అంది సౌందర్య.

ఎంతో బలవంతం మీద సుమిత్ర భూకేశ్వర్ అలాగే అన్నారు.

సౌందర్య తండ్రికి బీపితో పెరాలిసిస్ స్ట్రోక్ వచ్చింది. రెండు నెలలు మందులు, ఎక్సర్‌సైజులు. పని చేస్తే మళ్లీ మామూలుగా అవుతాడు. కోడలు అన్నపూర్ణ అలా వచ్చి చూసి వెళ్లిపోయింది. అన్నయ్య ఖర్చుల ఊసెత్తకుండా వదిన కొంగుచాటునే ఉండి వెళ్లిపోయాడు. అలా చూసి వస్తానని వచ్చిన సౌందర్య రెండు రోజులుండి మళ్లీ వస్తానని యింటికి వెళ్లింది. ఇల్లు చేరేసరికి యిల్లంతా హంగామాగా ఉంది.

పిల్లలు వీడియోగేమ్స్ ఆడి ఎక్కడివక్కడే పడేసినట్టున్నారు. సౌందర్య వాళ్లాయన పిల్లల్ని కొట్టి కొట్టి రొప్పుతున్నాడు. పిల్లలు ఏడుపు ఆపి తిట్లందుకున్నారు. సుమిత్ర ఒక వైపు వాళ్లాయన ఒకవైపు వారిస్తున్నారు. సుమిత్ర పిల్లలు యిదంతా చోద్యం చూస్తున్నారు.

"ఆ ముండ రెండు రోజులైంది వెళ్లి. ఇక్కడ ఇవన్ని ఎవరు చేస్తారు? ఈ లం..కొడుకు నన్ను యివన్ని చేయమంటాడు. ఇంత వండి పెట్టకుండా పుస్తకాలు పత్రికలు ముందేసుకుంటాడు. వీడే వండి పెట్టవచ్చు గదా! నన్ను పని చెయ్యమంటాడా? బాల్యంల పిల్లల్ని ఎంత బాగా చూసుకోవాలి. అలా చూసుకోని వాళ్లు మమ్మల్ని ఎందుకు కన్నారు. సాకడం చేతకాని వాళ్లు చావాలి" పెద్దవాడు అతుల్ అరుస్తున్నాడు తండ్రి మీద.

భూకేశ్వర్ వాన్ని అదిమి పట్టి నోరు మూస్తుంటే గింజుకున్నాడు అతుల్. హిరణ్ ఏడుస్తున్నాడు.

"మర్యాద దక్కదు. నన్ను వదులు అంకుల్. ఈ గాడిద కొడుకు డాడీ అట. ఎన్ని కొట్టాడో చూడు. వీడి సంగతి చెప్తా, ఆగు.." అంటూ ఏవేవో టీవీ సీరియళ్లు చూసిన ఫోజులు కొడ్తూ రొప్పుతున్నాడు అతుల్.

సౌందర్యకు పట్టరాని కోపం వస్తోంది. సుమిత్ర చేతుల్లోంచి గింజుకుంటూ చిన్నోడు హిరణ్ ఏడుస్తూ తిట్లందుకున్నాడు. పెద్దవాడు అతుల్ కోపం సుమిత్ర మీదికి మళ్లింది.

"ఆంటీ! అసలు ఈ పోట్లాటకంతా మీరే కారణం. మమ్మీ లేదని మీరు యింత వంట చేసి యిస్తే యిదంతా జరిగేదా! ఇంతకు ముందున్న ఇంట్లోని పక్కింటి ఆంటీ ఎంత మంచిదో తెల్సా! మమ్మీ ఊరెళ్తే టీలు టిఫిన్లతో సహా అన్ని మమ్మీ కన్నా టంచనుగా వాళ్లింట్లో చేసి పంపించేది. మీరున్నారు. సెల్ఫిష్... పిసినారులు"

అతుల్ దండకం యింకా ఎంతసేపు సాగేదో. వాళ్ల డాడీ శ్రీకాంత్ గబాల్న ఉరికి ఫెడిఫెడిమని మళ్లీ నాలుగంటించాడు.

"ఎవడ్రా సెల్ఫిష్. నీ వంట నీవు వండుకోలేని సెల్ఫిష్ పారసైట్స్‌కు లోకమంతా సేవ చేయాల్రా? లోకానికి మీరేం చేసి పెడ్తున్నార్రా, బొచ్చు" అంటూ డొక్కలో గుద్దాడు శ్రీకాంత్.

"వద్దన్నయ్యా ఆగు! పిల్లల్ని స్వయంపోషకంగా పెంచడం చాతగాక గారాబం చేసి ఇప్పుడు కొట్టడం దేనికి మీరు తప్పు చేసి వాళ్లను శిక్షించడం ఎందుకు? చిన్నప్పట్నించి అన్ని పనులు నేర్పి పని పట్ల గౌరవం కలిగిస్తే యిలా జరగదని నేను మొదట్నించి చెప్తునే ఉన్నాను" అంటూ కొట్టడాన్ని వారించింది సుమిత్ర.

సుమిత్ర మాటల్తో సౌందర్యకు రోషం పొడుచుకొచ్చింది. "ఇంత వండిస్తే ఈవిడ ముల్లేం పోయింది. ఈ కాస్తా సాయం చేయదుగాని తగుదునమ్మా అంటూ తీర్పులు చెప్పడానికొచ్చింది" అని అంటూ సూటుకేసు గబాల్న ఎత్తేసింది.

"వండి పెడ్తే పోయేది ముల్లే కాదు. ఆత్మగౌరవం, నా పిల్లల ఆత్మగౌరవం. నా పిల్లలు పని చేస్తే నీ పిల్లలు కూర్చుని తినాలా?" విసురుగా అంది సుమిత్ర.

మమ్మీని చూడగానే పెద్దవాడు అతుల్‌కు ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

"చూడు మమ్మీ! ఈవిడ వండి పెట్టదట గాని నీతులు చెప్పడానికి వచ్చింది" అంటూ అరిచాడు అతుల్.

సుమిత్రకు ఓపిక నశించింది. "ఇంత రోతవెధవల్ని ఎప్పుడు చూడలేదు" అంటూ చిన్నవాడు హిరణ్‌ను వదిలేసి మూడు అంగల్లో వెళ్లి అతుల్‌ని ఈడ్చి నాలుగు వేసింది.

"ఏంట్రా కూశావ్! ఉచ్చబుడ్డ మొహమా! దున్నపోతులా బలిశావ్. నీ తిండి నువ్వు వండుకోలేవూ, నేన్నీకు వంట చేసి పెట్టాలా! నీ పని మనిషనుకున్నావా? ఈడ్చి తన్నానంటే మూతి పళ్లు రాలాలి" సుమిత్ర కోపం కట్టలు తెంచుకుంది.

సౌందర్యకు తండ్రి మంచాన పడ్డ దుఃఖం ఎపుడో ఎగిరిపోయింది. కొడుకుల్ని సమర్థించింది సౌందర్య.

మమ్మీ మద్దతు చూసి పెద్దాడు అతుల్ విజృంభించాడు.

"ఆంటీ! యూ బిచ్! బ్రూట్! పిగ్" అంటూ సుమిత్రను తిడ్తున్నాడు. అప్పుడు సుమిత్ర పిల్లలు ఆవేశం పట్టలేక లోపలికి ప్రవేశించారు.

"ఏంట్రా వెధవ! నీయమ్మ ఎంతమందితో పోతే పుట్టావురా?" అంటూ అతుల్‌ని యింటర్ చదివే రాకేశ్ ఒక్కటిచ్చాడు. భూకేశ్వర్ వాడిని అడ్డుకున్నాడు. అది అదునుగా అతుల్ స్టార్ స్పోర్ట్స్ టీవీలోలా ఒక్కటిచ్చాడు రాకేశ్‌ని. రాకేశ్ ఉగ్రుడయ్యాడు.

"ఆంటీ వీన్ని చీరిపారేస్తాను. వీడు ఎవడికి పుట్టాడో నిజం చెప్పు. వాళ్ల డాడీకే పుట్టాడా! పుడ్తే- వాళ్ల డాడీలా ఎందుకు లేడు" రాకేశ్ గర్జనతో సౌందర్య ఒళ్లంతా చెమట పట్టింది. ఒంటేలు పోసుకుంది. శ్రీకాంత్‌కు తల తీసినట్టుగా వుంది.

ఇల్లు రణరంగమే అయ్యింది. అరగంట తర్వాత భూకేశ్వర్ మళ్లీ మొదట్నుంచి సౌందర్యకు చెప్పుకొచ్చాడు. తండ్రికొడుకుల పోట్లాట ఆపబోతే ఎన్ని మాటలన్నారో వివరించాడు. జరిగింది అలా కాదు యిలా అంటూ మళ్లీ చెప్పుకొచ్చింది సుమిత్ర.

"నేను వంట చేయననలేదు సౌందర్యా! ఏదో పోనీలే రెండు రోజులేగా చేసి పెడదామనే అనుకున్నాను. నేను మీ ఇంట్లో వంట చేస్తాను గానీ మా ఇంట్లో కాస్త పని చేయండి. మా పిల్లల్తో కల్సి పని చేయండి. వాళ్లు వంట ఎలా చేస్తారో చూసి నేర్చుకోండి. గిన్నెలు కడిగి ఊడ్చి పెట్టండి. మా పిల్లల్తో పాటు మీరు కూడా నీళ్లు మోయండి అని చెప్పాను. ఆ మాటలకు నీ ముద్దుల కొడుకులేమన్నారో అడుగోసారి" అంది సుమిత్ర రోషంగా.

"నా కొడుకులు నీ యింటి పని మనుషులనుకున్నావా?" సౌందర్య కోపంగా అంది. కొడుకుల్ని మరింత దగ్గరికి తీసుకుంది.

"సరిగ్గా నీ మొద్దు మొహాలు కూడా యిదే మాటన్నారు. అంటే వంట చేసి పెట్టడానికి నేను మీకు పని మనిషిననుకున్నారా, చేయను. అని చెప్పి వచ్చేశాను. అసలు మీరే వంట చేయవచ్చు కదా! నేనెందుకు చేయాలి అని మీ ఆయన్ని కూడా దులిపాను" అంది సుమిత్ర.

"తెచ్చి పెడ్తే తినుకుంటూ టీవీ, క్రికెట్, వీడియో గేమ్స్ ఆడుకుంటూ వీళ్లు విచ్చలవిడిగా ఎగురుతుంటే నేనేమో డ్యూటీ నుండి వచ్చి వంట చేసి పెట్టాలా?" కయ్యిమన్నాడు శ్రీకాంత్.

"కుహనా ప్రేమ ఒలకబోసి వెట్టిచాకిరి చేయించుకునేవారిని చూస్తే నాకు చెప్పుచ్చుక్కొట్టాలనిపిస్తుంది" అంది సుమిత్ర సౌందర్యకేసి అసహ్యంగా చూస్తూ.

సౌందర్య ఏవేవో ఊహించుకొని వచ్చింది. ఒక నెలరోజులు తండ్రి దగ్గరికి వెళ్తానని ఏడిస్తే దానిదేముంది నేను వంట చేసిపెడ్తాలే అని సుమిత్ర అంటుందని ఊహించుకుంది సౌందర్య. ఇక్కడ పరిస్థితి తిరగబడింది.

"పొరుగువారెలాంటి వారో తెల్సుకోకుండా ఈ పోర్షన్‌లోకి రావడం మాదే బుద్ధి తక్కువ. ఈ ఇల్లు రేపే ఖాళీ చేస్తాను" అంది సౌందర్య బింకంగా.

"మూడు నెలల ముందు నోటీసు యివ్వాలి. లేదా మూడు నెలల అద్దె ఎక్స్‌ట్రా కట్టి ఖాళీ చేయాలి. ఒక్క పైసా తక్కువైనా సామాను బయటకు వెళ్లదు. లీగల్ నోటీసు ఇప్పిస్తాను" అంది సుమిత్ర.

సుమిత్రలోని మంచితనాన్ని ఒక బలహీనతగా భావించిన సౌందర్య ఆ మాటతో అవాక్కయిపోయింది. ఈ ఇంట్లో యింకా మూడు నెలలుండాలా? ఈ మూడు నెలల్లో ఎన్ని పోట్లాటలౌతాయో. తనని ఏం చేస్తుందో అని వణికిపోయింది. ఇన్నేళ్లుగా ఎక్కడ అద్దెకుంటే అక్కడి వీధి వీధంతా వణికించిన సౌందర్య యిక్కడ తానే వణికిపోయింది.

పద పద అంటూ భువనేశ్వర్ పిల్లల్ని సుమిత్రను అదిలిస్తూ తమ యింట్లోకి తోడ్కొచ్చాడు. "పెంచడం రానివాళ్లు కనడం దేనికి మంది గండానా" అని తిడ్తు యింట్లోకి నడిచింది సుమిత్ర.

వారం రోజుల తర్వాత "సౌందర్యా! ఫాదర్ సీరియస్ స్టార్ట్ ఇమిడియట్లీ అని అమ్మ యిప్పించిన టెలిగ్రాం చూసి భోరున ఏడ్చేసింది సౌందర్య.

"కంగారు పడకు. రెండ్రోజుల్లో వస్తానని నువ్వు రాకపోయే సరికి తోడు కోసం మీ అమ్మ అలా టెలిగ్రాం యిప్పించిందేమో" అంటూ ధైర్యం చెప్పాడు శ్రీకాంత్.

"ఒక నెల రోజులు ఉండి వస్తానండి" అంది సౌందర్య భర్తను బతిమాలుతూ.

"సరే మంచిది" అన్నాడు శ్రీకాంత్.

నెల రోజులకు సరిపడా బట్టలు సర్దుకొంది సౌందర్య. అది చూసి పెద్దవాడు అతుల్ మమ్మీ చేతిలోని సూటుకేసు లాక్కున్నాడు.

"నీ ఉద్దేశం ఏంటి? నేను టెన్త్ ఫెయిల్ కావాలనా! ముసలివాడు ఎప్పుడైనా

దావకతప్పదు. నా భవిష్యత్తు పాడు చేస్తావా? యిక్కడ పని ఎవరు చేస్తారు. నువ్వు లేకపోతే ఈ పని ఆ పని చెప్పి చెయ్యలేదని డాడీ మమ్మల్ని తంతాడు" అని అరిచాడు అతుల్.

"మా నాన్న చచ్చిపోవాలా? నీకిక్కడ వండి పెట్టుకుంటూ ఉండాలా?" అంటూ నాలుగంటించింది సౌందర్య.

అకస్మాత్తుగా అతుల్ ఎదురు తరిగాడు. మమ్మీని రెండు అంటించాడు. దెబ్బ బాధ కన్నా చెయ్యెత్తిన బాధతో సౌందర్య దిమ్మెరపోయింది. డాడీ వాన్ని ఈడ్చి రెండేశాడు. సౌందర్యకు కోపం, దుఃఖం వస్తున్నాయి. ఏడుస్తూ కూలబడిపోయింది.

"వీళ్ల సంగతి నేను చూసుకుంటాను గానీ పద" అంటూ బయల్దేరదీశాడు శ్రీకాంత్.

❋ ❋ ❋ ❋

సౌందర్య వాళ్ల నాన్న చనిపోయాడని వెంటనే రమ్మని ఫ్రెండింటికి ఫోన్ రావడంతో హుటాహుటిన తయారయ్యాడు శ్రీకాంత్.

అతుల్, హిరణ్‌లు టీవీల వద్ద కూర్చున్నారు. "తొందరగా రెడీ అవ్వండి" అని తొందరపెట్టాడు శ్రీకాంత్.

"సారీ డాడీ! క్రికెట్ మ్యాచ్ నడుస్తుంది. పైగా డేంజరస్ డెవిల్ సీరియల్ మిస్సవుతుంది. మేం వంట చేసికొంటాం. లేదా సతీష్ వాళ్ల మమ్మీ యింట్లో భోంచేస్తాం మీరు వెళ్లండి" అన్నాడు అతుల్.

శ్రీకాంత్‌కు ఆశ్చర్యం వేసింది. తాతయ్య చచ్చిపోయాడన్న బాధే లేదేంటి వీరికి. "ఒరేయ్! మిమ్మల్ని గుండెల మీద ఎక్కించుకొని ఆడించాడ్రా తాతయ్య! నీ పురిటి ఖర్చులు పెట్టి, గోల్డ్ చైన్ పెట్టాడ్రా" అరిచాడు శ్రీకాంత్.

"అయితే ఏంటీ డాడీ! చచ్చిపోయిన తాతయ్య మేం వచ్చామని చూడరాడు గదా! మీరే వెళ్లండి" అన్నాడు అతుల్.

"చచ్చిపోయిన వాళ్లంటే నాకు చాలా భయం డాడీ! చచ్చిపోయాక తాతయ్య డేంజరస్ డెవిల్ సీరియల్‌లోలా మారతాడా డాడీ!" భయపడ్తూ అడిగాడు హిరణ్.

ఒక పక్క దుఃఖం, మరో పక్క కోపం....

ఆంధ్రభూమి, 2001